క్లుప్తంగా

నేటి నుంచి శ్రీ మద్దిలేటయ్య క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు నిజశ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు తెలిపారు. శ్రావణ మాసంలో ప్రతి శుక్ర, శనివారాల్లో అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకార్యర్థం ఉత్సవాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీ బంగారుకొండ పాతపాలెం అభయాంజనేయస్వామికి బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసం, అమావాస్య పురస్కరించుకుని గ్రామస్తులు పూజలు చేశారు. ఉదయం పంచామృతాభిషేకాలు, తమలపాకుల తోరణాలు, సింధూర కుంకుమార్చనలు, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

నేటి నుంచి నాగప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన నాగులకట్ట వద్ద గురువారం నుంచి నాగ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో గోపూజ, గణపతి పూజ, మాతృకాపూజ, పంచగవ్యప్రాశన, ప్రాత:కాల పూజ, యంత్రాభిషేకం, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కోవెలకుంట్ల: జాతీయ ఉపాధి హామీపథకం కింద గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మామిడి, చీని, సపోట, నిమ్మ, దానిమ్మ తదితర పంటల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు.

17వ విడత సామాజిక తనిఖీపై గ్రామ సభలు

బేతంచెర్ల: మండలంలోని కనుమ కింది కొట్టాల, గూటుపల్లె గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం డీఆర్పీ ఓబులేష్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో 17వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై నివేదికలు వినిపించారు. కనుమ కింది కొట్టాల గ్రామంలో మూడు పనులకు రూ.13, 14 లక్షలు, గూటుపల్లెలో 23 పనులకు రూ. 53, 69 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, స్వామి నాయక్, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.


నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బనగానపల్లె జయజ్యోతి ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మద్దిలేటి రెడ్డి, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివ ప్రసాద్, సీనియర్ మేనేజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ షమీ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఈఓఆర్డీ రాధికను సన్మానిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ఉత్తమ సేవలందించిన కోవెలకుంట్ల ఈఓఆర్డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక పంద్రాగస్టును పురస్కరించుకుని అవార్డు పొందటంతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అవార్డు గ్రహీతను శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అశోక్‌కుమార్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, అన్వర్, శారద, నాగలక్ష్మి,హబీబ్, సీనియర్ అసిస్టెంట్ నాగన్న, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్

- ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది
- ఉద్యోగుల పేర్లతో కూడిన సైన్‌బోర్డులు ఏర్పాటు



కొలిమిగుండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



సిబ్బంది వివరాలతో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డు

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మారు మూల గ్రామాల ప్రజలకు సైతం మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు సంపూర్ణంగా వైద్య సేవలు అందుతున్నాయి. నాడు–నేడు కార్యక్రమంతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులు, బోధనా ఆసుపత్రుల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేట్ ఆసుపత్రులను దీటుగా మౌలిక వసతులు సమకూరాయి. గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. అన్ని పీహెచ్‌సీల్లో ఒకే విధమైన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అందుకు తగ్గట్టుగానే అధికారులు ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాల సిబ్బంది ఉండేలా రేషనలైజేషన్ చేపట్టారు.

గతంలో అరకొర సిబ్బంది

గతంలో ఒక్కో పీహెచ్‌సీలో సిబ్బంది ఓ విధమైన విధులు నిర్వహించేవారు. ఒక్కో ప్రాంతంలోని పీహెచ్‌సీలో ఉద్యోగుల సంఖ్యలో తేడాలు ఉండేవి. ప్రజలకు అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందేవి. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది అందుబాటులో ఉండరనే అపవాదు ప్రజల్లో ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐపీహెచ్(ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్) ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చారు. రేషనలైజేషన్ చేసిన తర్వాత ప్రతి పీహెచ్‌సీకి కేటాయించిన 14 మంది సిబ్బంది వివరాలతో కూడిన సైనింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల కేడర్, పేరుతో కూడిన వివరాలు అందులో ఉంటాయి.ఈ మేరకు జిల్లాలోని 51 పీహెచ్‌సీల్లో సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

14 మంది ఉద్యోగులు వీరే

పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ప్రభుత్వం 14 మంది ఉద్యోగులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ఒకరు సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, హెల్త్ సూపర్ వైజర్లు ఇద్దరు, సీహెచ్ఓ లేదా ఎంపీహెచ్ఓల్లో ఒకరు, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్ఎన్, ఎఫ్ఎన్ఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ ఒక్కొక్కరు ఉంటారు.

ప్రజలకు మెరుగైన సేవలు

పీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం వైద్య రంగంపై దృష్టి పెట్టడంతో చాలా మార్పులు వచ్చాయి. ప్రతి పీహెచ్‌సీకి 14 మంది సిబ్బంది అందుబాటులో ఉండటంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది వివరాలతో సైన్‌బోర్డు ఏర్పాటు చేశాం. రోజువారీ ఓపీ సేవలు బాగా పెరిగాయి.

– రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్

రెండో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: పట్టణంలోని రెండో వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతురాలిగా పోటీ చేస్తున్న జక్కు వెంకటలక్ష్మిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు మాట్లాడారు. రెండో వార్డు ఓటర్లు గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ మద్దతురాలిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, రాజా మురళి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్ రెడ్డిని గెలిపించండి



వెంకటగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో 19న జరిగే వార్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా బరిలో నిలిచిన మిట్టె వేణుగోపాల్ రెడ్డి గౌను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో అభ్యర్థి తరపున వెంకటగిరిలో వారు ప్రచారం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేష్, మురళీధర్ రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పదవ వార్డు ఉప ఎన్నికల ప్రచారం బుధవారం ముమ్మరంగా సాగింది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి మాలె స్వరూప ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. ప్రెషర్ కుక్కర్ మీద ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆకుమల్ల సొసైటీ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ గౌరిగారి వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కైప రమేష్ రెడ్డి, ఉసేన్ రెడ్డి, కాశింబాషా, ధర్మారెడ్డి తదితర నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ప్రజలకు సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలు ప్రవేశ పెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని గౌరిపేటలో కౌన్సిలర్స్ శకుంతల, ఇబ్రహీం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వారు ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, శేఖరయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి, జశ్వంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, హసన్, సలీం పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు అందజేస్తున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి అందజేస్తున్న 'బుగ్గన నగదు పురస్కారాలు' కార్యక్రమం జరిగింది. గత ఏప్రిల్ జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన తులసికి రూ. 5 వేలు, లావణ్యకు రూ. 3 వేలు చొప్పున రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆసియా బేగం, హెచ్ఎం ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు దివాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి పూజలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాస అమావాస్య బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి కి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాసేవలో మమేకం కావాలి



భానుసింగ్‌ను సత్కరిస్తున్న రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు

డోన్ : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రజాసేవలో మమేకం కావాలని ప్రభుత్వ ఉద్యోగుల గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి సోమేశ్వరరావ్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుసింగ్ 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుసింగ్ సంఘాన్ని ఎంతో బలోపేతం చేయడమే కాకుండా ఆయన సతీమణి దివంగత భవానిభాయి పేరుతో రూ.5లక్షల విరాళంతో సంఘానికి నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో సబ్‌ట్రెజరీ అధికారి రఘునందన్, ఏపీఎన్‌జీఓ సంఘం కార్యదర్శి ప్రేమ్, సంఘం గౌరవాధ్యక్షులు హనీఫ్, అధ్యక్షులు మౌలాలి, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షులు దాసప్ప, సభ్యులు రాందాస్‌రెడ్డి, ఏకనాథరెడ్డి, సుబ్బరాయుడు, రామక్రిష్టారెడ్డి, నరసింహులు, కిషన్‌సింగ్, పురుషోత్తం, రిటైర్డు ఎస్సై మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ జవాన్లను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

జవాన్ల సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల: దేశ భద్రతకు సేవలు అందిస్తున్న ఆర్మీ జవాన్ల సేవలు చిరస్మరణీయం అని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ అన్నారు. బుధవారం పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుండా గోపాలు, విజయనాగరాజు, మద్దిలేటిస్వామి, వీరారెడ్డి, రామూర్తి పాల్గొన్నారు.

సత్కారం



నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలో పేరుసోముల గ్రామంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న నాగరాజుకు ఉత్తమ జూనియర్ లైన్‌మెన్ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం పేరుసోముల సబ్ స్టేషన్ ఆపరేటర్లు, గ్రామ రైతులు నాగరాజును సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. జగనన్న పాలనలో పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. స్థానిక పొదుపు భవనంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కాటసాని ఓబుల రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బనగానపల్లె నియోజకవర్గ స్థాయి గ్రామ సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశానికి జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పేదలకు జరిగిన మేలును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ కన్వీనర్లదే అని చెప్పారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా సమచారాన్ని చేరవేయాలని వివరించారు. అన్నివర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్న విషయం వాస్తవమని, ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును ఓర్వలేక టీడీపీ నాయకులు పాల్పడుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజాభిమానమే కొండంత బలం

ప్రజల అభిమానం... వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఆప్యాయతా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కొండంత బలమని ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబులరెడ్డి పేర్కొన్నారు.ఈ బలంతోనే ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని, బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు,వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, అవుకు,కొలిమిగుండ్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, అంబటిగుర్విరెడ్డి, బనగానపల్లె మండలం ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్ హుస్సేన్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, అవుకు,కొలిమిగుండ్ల సంజామల కొవెలకుంట్ల మండలాల సచివాలయాల కన్వీనర్లు సుబ్రహ్మణ్యం, రాజారెడ్డి, డి.సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ రాజులుగా మారిన టీడీపీ నాయకులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతీరుతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అయోమయంలో పడ్డారని, పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు తమ్ముళ్లను రెచ్చగొడుతూ విధ్వంసాలు సృష్టించేలా కుట్రలు పన్నుతున్నారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుత పాపిరెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబుతోపాటు నాయకులు సెల్ఫీరాజులుగా మారిపోయారని ఎద్దేవా చేసిన జెడ్పీ చైర్మన్ 1952లో నిర్మించిన స్థానిక దద్దణాల ప్రాజెక్టు వద్ద మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సెల్ఫీ దిగడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో దద్దణాల చెరువులో పూర్తిస్థాయిలో నీరు ఉన్నందున ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించాల్సిన అవసరం లేకుండా పోయిందన్న విషయం మాజీ ఎమ్మెల్యే బీసీకి తెలియదా అని నిలదీశారు. బనగానపల్లె పట్టణంలో రూ.23 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు చివరదశకు చేరుకున్నాయని, త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిక మించేందుకు రూ.8 కోట్లతో పోర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్న విషయం ప్రజలకు తెలుసన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కుట్రపూరిత రాజకీయాలకు టీడీపీ నాయకులు తెరలేపారని, ప్రజలకు ప్రభుత్వం నుంచి జరిగిన మేలును వివరించి తెలుగు తమ్ముళ్ల నీచరాజకీయాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

పంటల నమోదు పరిశీలన

బేతంచెర్ల: మండలంలోని అంబాపురంలో బుధవారం హర్టికల్చర్ అధికారి సుధాకర్ రెడ్డి చేస్తున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ఏఓ కిరణ్ కుమార్ పరిశీలించారు.పంటల నమోదు వలన రైతులు రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం తదితర ప్రయోజనాలు పొందవచ్చని ఏఓ తెలిపారు.

ఎంపీడీఓకు అభినందనలు

బనగానపల్లెరూరల్: ఉత్తమ మండల పరిషత్ అవార్డు అందుకున్న ఎంపీడీఓ శివరామయ్యను బనగానపల్లె మండల ఏపీఎన్జీఓ అధ్యక్షుడు నల్లగట్ల వెంకటేశ్వర్లు, సెక్రటరీ అల్తాఫ్‌హుస్సేన్ అభినందనలు తెలిపారు. ఎంపీడీఓకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీడీఓ శివరామయ్యను అభినందించారు.

చీటింగ్ కేసు నమోదు

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన ఓ మహిళను మోసం చేసిన యువకుడిపై బుధవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఓ మహిళతో పట్టణానికి చెందిన నరసింహ అనే యువకుడు కొన్ని నెలల నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఇరువురి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు నరసింహాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బాటిళ్ల స్వాధీనం

డోన్ టౌన్ : మండలంలోని కొత్తకోట గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వడ్డే నరేష్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆంధ్రకు చెందిన 26 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

టైలర్ మృతి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన సీనియర్ టైలర్ కృష్ణారెడ్డి (50)అనారోగ్యంతో బుధవారం మరణించాడు. ఆయన మృతి పట్ల మండల టైలర్స్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. టైలర్స్ అసోషియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, ఖలీల్, సభ్యులు చంద్రారెడ్డి, మద్దిలేటి, గంగన్న, ఆచారి, సుధాకర్ తదితరులు కృష్ణారెడ్డి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు కాంట్రాక్టు ఉద్యోగుల కృతజ్ఞతలు

బనగానపల్లె: కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడంపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ బుధవారం పత్రిక ప్రకటలో కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయడం హర్షనీయం

కోవెలకుంట్ల: ఒప్పంద ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం హర్షనీయమని ఆ సంఘం జేఏసీ ఆర్థిక కార్యదర్శి అబ్దుల్ జబ్బార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 4వేల మంది ఒప్పంద అధ్యాపకుల ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయడం సీఎం జగన్మోహన్‌రెడ్డికి సాధ్యమైందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న వారి కలను సీఎం నెరవేర్చారని పేర్కొన్నారు. ఒప్పంద ఉద్యోగులు, అధ్యాపకుల సంఘం తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బహుమతుల ప్రదానం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మారం విష్ణు, అధ్యక్ష, కార్యదర్శులు కల్కి వెంకట సతీష్, రాజు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్రహం, లయన్స్ క్లబ్ సభ్యులు వలిబాషా, ధనుంజయ, సుదర్శన్, ట్రెజరర్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు

కూలిన తరగతి గదిగోడ

బనగానపల్లెరూరల్: మండలంలోని హుస్సేనాపురం ఎంపీపీ పాఠశాల తరగతి గది గోడ కూలింది. మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు బయట ఉన్న సమయంలో గోడ కూలింది. ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని హెచ్ఎం మద్దిలేటినాయక్ తెలిపారు. ఈ పాఠశాల పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో కొత్త తరగతి గదుల నిర్మాణానికి ఉన్నతాధికారు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు.

మచ్చలేని నాయకుడు కోట్ల

డోన్ టౌన్ : రాజకీయ జీవితంలో మచ్చలేని మహా నాయకుడు దివంగతనేత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి అన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 103వ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని జెడ్పీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు జనార్దన్, కార్యదర్శి శ్రావణ్, సీనియర్ నాయకులు బాబులాల్ పాల్గొన్నారు.

రీసర్వే పూర్తి చేయండి

నంద్యాల: జిల్లాలో చేపట్టిన రెండవ దశ రీసర్వే పనుల ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, మండల తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రీసర్వే, అసైన్‌మెంట్ భూములు, భూసేకరణ, ఓటర్ల జాబితా సవరణ అంశాలపై మాట్లాడారు. 76 గ్రామాలకు గాను 23 గ్రామాల్లో పూర్తయ్యిందని, మిగిలిన 53 గ్రామాల్లో నెలాఖరు నాటికి పూర్తి చేయాలని చెప్పారు. డీఆర్ఓ పుల్లయ్య, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హరికృష్ణ పాల్గొన్నారు.

ఈ క్రాప్ తప్పనిసరి



సంగటష్మంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

అవుకు: సాగుచేసిన ప్రతి పంటకు రైతు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శింగనపల్లె, సంగపట్నం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ వలన రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, పంటనష్ట పరిహారం, బీమా తదితర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు రైతులకు వర్తిస్తాయన్నారు. అనంతరం పొలాల వద్దకే వెళ్లి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు బాషా, భాగ్యవతి పాల్గొన్నారు.